క్లుప్తంగా

భాకరాపేటలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్ పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేని వాహనాదారులపై కేసులు నమోదుచేసి రూ. 4,455 జరిమానా విధించినట్లు తెలిపారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపినందుకు జైలుశిక్ష



శిక్ష పడిన ముద్దాయి

రాజంపేట : వల్లూరు మండలం తోల్లగంగన్నపల్లె గ్రామానికి చెందిన మంత్రి రాజేష్ మద్యంసేవించి, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపినందుకు నాలుగురోజులు జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ రాజంపేట జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. మంగళవారం ఈమేరకు రూరల్ ఎస్‌ఐ భక్తవత్సలం వివరాలు వెల్లడించారు. సోమవారం గుండ్లూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో మంత్రి రాజేష్ మద్యంసేవించి, ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా మేజిస్ట్రేట్ లత ఈమేరకు తీర్పును వెలువరించారన్నారు.

హజ్ యాత్రికులకు ఆర్థిక సాయంపై హర్షం



గుల్జార్‌బాషా

రాజంపేట : రాష్ట్ర హజ్ యాత్రికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక ఆర్థిక సాయం కింద రూ.14.51 కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేయడం హర్షనీయమని ఏపీఆర్‌డీసీ స్టేట్ డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా అన్నారు. మంగళవారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కొక్కరిపై రూ.80వేల చొప్పున 1813 మంది యాత్రికులపై పడిన భారాన్ని ప్రభుత్వం భరించడం సంతోషకరమన్నారు. దేశంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి కూడా ముస్లిం మైనార్టీల పట్ల చేయని పనులు చిత్తశుద్ధితో అమలుపరిచి ముస్లిం మైనార్టీ పక్షపాతి సీఎంగా పేరొందారన్నారు. ఇందుకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న గృహ నిర్మాణ పనుల పరిశీలన



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెం, వెలుగుపల్లె గ్రామాల్లో జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాల పనులను ఈఓపీఆర్‌డీ బి. పులి రామ్‌సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారుల సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.వి.ప్రజ్ఞ, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం



కాలిపోయిన పూరిగుడిసెను పరిశీలిస్తున్న వీఆర్‌ఓ

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని గాదెల కొత్తపల్లి పాత దళితవాడ గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పోలి శ్రీనివాసులకు చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. గ్రామంలోని ప్రజలందరూ సమీపంలోని పంటపొలాల నుంచి నీరు తెచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే పూరిగుడిసె పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో ఇంట్లో ఉన్న దాదాపు రూ. 70 వేలు నగదు, దుస్తులు, గృహోపకరణ వస్తువులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లింది. వీఆర్‌ఓ వెంకటకృష్ణయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

మహిళాభివృద్ధే సీఎం లక్ష్యం

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రామ సచివాలయం 4 పరిధిలోని వడ్డిపల్లి, రామ్‌నగర్‌లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కుల, మత, వర్గ, పార్టీ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా అందరికీ తోడు నీడగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ బాసటగా నిలవాలని కోరారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, చెవ్వ శ్రీనివాసులరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీఓ నాగార్జున, సీహెచ్.రమేష్, రాఫ్, వైఎస్ కరీముల్లా, నాగరాజు, లక్ష్మయ్య, గణేష్, మురళి, దొంతిరెడ్డి రాజారెడ్డి, రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి కొనుగోలుకు రుణాలు ఇవ్వండి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జగనన్న హౌసింగ్ కాలనీలలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలలో సెంట్రింగ్ పనులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జగనన్న హౌసింగ్ కాలనీలలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వివిధ బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడానికి బ్యాంకర్ల సహకారం అవసరమన్నారు. ఇందులో భాగంగా సెంట్రింగ్ పనులకు బ్యాంకర్లు రుణాలను ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ బ్యాంకు మేనేజర్లు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య



మృతి చెందిన నందిత

సంబేపల్లె : సెల్‌ఫోన్ చూడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో మండల పరిధిలోని మోటకట్లకు చెందిన కుమ్మ సుధాకర్, గంగాదేవిల కుమార్తె నందిత (15) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు నందిత మంగళవారం సెల్‌ఫోన్ చూస్తుండగా కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలు 9వ తరగతి పూర్తి చేసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

హార్సిలీహిల్స్‌కు ఆర్టీసీ బస్సులు నడపాలి

రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నుంచి హార్సిలీహిల్స్‌కు ఆర్టీసీ బస్సులను నడపాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక స్థలంగా, ఆంధ్రా ఊటీగా పేరు పొందిన హార్సిలీహిల్స్‌కు రాయచోటి నుంచి నేరుగా బస్సులు లేకపోవడం బాధాకరమన్నారు. దీంతో ప్రయాణికులు హార్సిలీహిల్స్ సందర్శనకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రాయచోటి నుంచి హార్సిలీహిల్స్‌కు ఆర్టీసీ బస్సులను నడపగలిగితే ప్రభుత్వానికి ఆదాయం లభించడంతో పాటు పర్యాటకులకు రవాణా సౌకర్యం కలిగించినట్లవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని హార్సిలీహిల్స్‌కు ఆర్టీసీ బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాటల ద్వారా సులువుగా గణితబోధన



విద్యార్థులు తయారుచేసిన మాస్క్‌లు, బొమ్మలను ప్రదర్శిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్: ఆట,పాటల ద్వారా గణితాన్ని సులువుగా బోధించవచ్చని వినోద గణిత నిపుణుడు విజయసారథిరెడ్డి అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు పాటల రూపంలో గణిత సూత్రాలను నేర్పించారు. అనంతరం చిత్రలేఖన నిపుణుడు రాజశేఖర్ విద్యార్థులకు బొమ్మలు వేయడంలో మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌అధికారి ఓబుళరెడ్డి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు రామయ్య, ప్రతాప్‌రెడ్డి, శంకరయ్య, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, ,ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



చిన్నమండెం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధామాధురి

చిన్నమండెం : చిన్నమండెం మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సహకరించాలని ఎంపీపీ సుధామాధురి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ రహీం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డిల కృషితో మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తహసీల్దార్ శ్రీరాములునాయక్ మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వెంటనే చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ రహీం మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రతి అధికారి అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి జేజేఎం కింద నీటికుళాయిలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులు జరుగుతున్నాయన్నారు. పంచాయతీరాజ్ జేఈ హర్షవర్ధన్‌రెడ్డి, చిన్నమండెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సునీతారెడ్డి, ఎంఈఓ శివానాయక్, ఉపాధి ఏపీఓ మాధవి, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏజాస్‌అలీఖాన్, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపీటీసీలు శ్యామ్‌చంద్ర, వెంకటప్పనాయుడు, రమేష్, తులసమ్మ, రత్నమ్మ, సర్పంచులు ముసలిరెడ్డి, లక్ష్మీరెడ్డి, నజీర్ అహమ్మద్, నజీర్‌బాషా, లోకేశ్వర్‌రెడ్డి, అఫ్రోజ్, దామోదర్, కళ్ల రమణ, వెలుగు ఏపీఎం దేవసేన, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలల సంఘం కార్యదర్శికి సన్మానం



కార్యదర్శి కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న ఆప్కాస్ సిబ్బంది

నందలూరు(రాజంపేట) : బీసీ గురుకుల పాఠశాలల సంఘం కార్యదర్శి ఆకేపాటి కృష్ణమోహన్‌ను ఆప్కాస్ సిబ్బంది అసోసియేషన్ నేతలు సన్మానించారు. ఈమేరకు మంగళవారం బీసీ గురుకుల పాఠశాలల బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదయ్య మాట్లాడుతూ మహాత్మాజ్యోతిబాపులే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థలో ప్రైవేటు ఏజెన్సీ కింద సుమారు 1450 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తూ సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడేవారన్నారు. సంస్థ కార్యదర్శి కృష్ణమోహన్ అందరిని ఆప్కాస్‌లోకి చేర్చారన్నారు. ఇందుకు కృతజ్ఞతగా తాము సన్మానం చేశామన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డిప్యూటీ సెక్రటరీ సుభాషిణి, గౌరవాధ్యక్షుడు శివకాంత్, అధ్యక్షుడు మనోహర్‌నాయుడు, టీవీరమణ, ఉపాధ్యక్షులు సిద్ధలింగప్ప, రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రమేష్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

రాయచోటి: హజ్ యాత్రకు వెళ్లే మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం తోడుగా నిలిచి మైనార్టీల పక్షపాతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని మరో మారు నిరూపించుకుందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. హజ్ యాత్రికులకు ప్రభుత్వం భరిస్తున్న ఖర్చు విషయంపై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌కు వెళ్లాలంటే అవకాశం ఉండేది కాదన్నారు. ఇప్పుడు విజయవాడ నుంచి వెళ్లే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించి హజ్‌కు వెళ్లే యాత్రికుల కల నెరవేర్చిందన్నారు. హజ్‌యాత్రకు బెంగళూరు, హైదరాబాద్‌ల నుంచి వెళ్లే దానికంటే, విజయవాడ నుంచి వెళ్లేవారికి రూ. 80 వేలు అదనంగా విమాన టికెట్ ధరల భారం పడుతోందన్నారు. ఈ విషయాన్ని స్థానిక సర్కార్‌జీ తమ దృష్టికి తెచ్చారన్నారు. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ ఆజం, ఎంపీ మిథున్ రెడ్డిలు ఆయా మంత్రిత్వశాఖల దృష్టికి తీసుకెళ్లినా మంత్రుల నుంచి సరైన స్పందన రాలేదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం స్పందించి రాష్ట్రం నుంచి నమోదై హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు అదనంగా పడుతున్న రూ. 80 వేలు భారాన్ని ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇవ్వడం హర్షదాయకమన్నారు. రాష్ట్రం నుంచి వెళ్తున్న 1813 హజ్ యాత్రికులకు సంబంధించి ఒక్కొక్కరికి అదనంగా పడుతున్న రూ. 80 వేలు చొప్పున రూ. 14.51 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసి సెంట్రల్ హజ్ కమిటీకి ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు.

నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలకు డిమాండ్



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాజంపేట టౌన్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం సబ్‌కలెక్టర్ అహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో అడ్మిషన్లు నిర్వహించకూడదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పట్టణంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులపై భారం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికి కొంతమంది నిలువు దోపిడీ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అఖిల్, సుభాన్, సాయి, కార్తీక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి పెంచండి



ముక్కవారిపల్లె ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఓబులవారిపల్లె : ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు కూలి డబ్బులు పెంచాలని సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జయరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉపాధిహామీ పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారికి రోజువారి వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.పెంచలయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి

పెనగలూరు : మండలంలో ఎవరైనా అర్హులై ఉండి పింఛన్ రానివారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి సూచించారు. మంగళవారం సచివాలయాలలోని సిబ్బందితో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ఆయా సచివాలయాల పరిధిలోని సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఏఓ పద్మభూషన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తీరుస్తారా.. వైదొలగుతారా!

వీరబల్లి మండల మీట్‌లో అధికారులపై ఎమ్మెల్యే మేడా ఆగ్రహం



ఏపీఎస్పీడీసీఎల్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వీరబల్లి(రాజంపేట) : ప్రజల సమస్యలు తీర్చలేని అధికారులు వెంటనే విధుల నుంచి వైదొలగండి అంటూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున తీసుకొస్తున్నారన్నారు. అలాంటప్పుడు వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉంటుందన్నారు. పనితీరును ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేలా పనిచేయాలన్నారు. గ్రామసభల వల్ల గ్రామాభివృద్ధి మనమే చేసుకోగలమన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మల్లేశ్వరి, తహసీల్దార్ తులసమ్మ, ఏపీడీ రెడ్డయ్యనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రస్తావించిన అంశాలివే...

- విద్యుత్ సౌకర్యాల కల్పనలో స్థానిక ఏఈ విఫలమయ్యారని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తంచేశారు. పనితీరు బాగాలేదని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు. ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్ సరఫరా, సౌకర్యాలను అందించాలని చెప్పారు. తాటిగుంటపల్లె ఎంపీటీసీ పురుషోత్తంరెడ్డి ఏఈ అవకతవకలపై ఫిర్యాదు చేశారు.
- పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు. పెదవీడు జెడ్పీ స్కూల్‌కు చెందిన లతీఫ్(557), ఎర్రమరాజుపల్లె జెడ్పీహైస్కూల్‌కు చెందిన రెడ్డి ప్రవల్లిక (556) ఉన్నారు. రెడ్డిప్రవల్లికకు అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ శ్రీదేవి రూ.1016 నగదు పారితోషికంగా అందజేశారు.
- రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు చేపట్టాలని సర్పంచ్ నాగిరెడ్డి కోరారు. పెద్దవీడులో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యా రు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మీ, పంచాయతీ కన్వీనర్ విశ్వనాథరెడ్డి, అనిల్, ఈఓపీఆర్డీ సురేష్‌బాబు, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు పాల్గొన్నారు.

డెంగీ నివారణ మనందరి బాధ్యత



లక్కిరెడ్డిపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రామాపురంలో..



నందలూరుర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి సృజన



రాజంపేట:ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: డెంగీ నివారణ మనందరి బాధ్యత అని పలువురు వైద్యాధికారులు పేర్కొన్నారు.జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అన్ని మండల కేంద్రాలు, పట్టణాల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె మండలం చింతకుంటవాండ్లపల్లి, కోనంపేటలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు డెంగీ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్, డాక్టర్ సిద్దయ్యలు మాట్లాడుతూ అర్బో డెంగీ వైరస్ వలన ఏడీఎస్ ఈజిప్ట్ టైగర్ దోమ ద్వారా ఒకరి నుంచి మరొకరికి డెంగీ జ్వరం వస్తుందన్నారు. డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం నీటి నిల్వలను శుభ్రం చేసి ఒకగంట ఆరబెట్టి ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిద్దయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్, సీహెచ్‌ఓ రవీంద్ర, సూపర్‌వైజర్ ఎం.సురేంద్రారెడ్డి, సతీష్, శివ, చంద్ర, రవికుమార్, రమణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : జాతీయ డెంగీ దినోత్సవంలో భాగంగా మంగళవారం మండల వైద్యాధికారులు విజయ కుమార్, వినోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైరల్ ఫీవర్ బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో సీహెచ్‌ఓ ఏలియేజర్, పీహెచ్‌ఎన్ విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవేంద్రరాజు, ఉమామహేశ్వరి, ఎంఎల్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : రాజంపేట పట్టణంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ శేషఫణి, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరులో వైద్యాధికారి సృజన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట: డెంగీ నివారణ మనందరి బాధ్యత అని వైద్యులు సానెశేఖర్, మనోజ్ చంద్ర తెలిపారు.



పుల్లంపేట:ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ మహేష్, శివగౌరి, మలేరియా యూనిట్ అధికారి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిబిరం

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులు నీతి పద్యాలు నేర్చుకున్నారని గ్రంథాలయాధికారి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల చేత పుస్తక పఠనం, చిన్నారులతో నృత్య ప్రదర్శన, పాటలు పాడించడం వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

వ్యాసరచన పోటీలు

రామాపురం : రామాపురం శాఖా గ్రంథాలయం పరిధిలో మంగళవారం వెంకటేశ్వర హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సూర్యనారాయణరెడ్డి మాట్లాడు తూ విద్యార్థులందరూ వేసవి సెలవులను వృథా చేయకుండా జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు.



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు